# ధాన్యం కొనుగోళ్లు @2.28 లక్షల మెట్రిక్ టన్నులు

24,686 మంది రైతుల నుంచి సేకరణ

యాదాద్రి జిల్లాలో తుది దశకు చేరిన కొనుగోళ్లు

అన్నదాత ఖాతాల్లో రూ.358 కోట్లు జమ

కర్షక లోకానికి దక్కుతున్న మద్దతు ధర

యాసంగి సీజన్ యాక్షన్ ప్లాన్‌కు కసరత్తు



భువనగిరి మార్కెట్‌లో ఆరబోసిన ధాన్యం

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడాది వానకాలం సీజన్‌లో అత్యధికంగా వరి సాగు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని 3,05,126 ఎకరాల్లో వరి వేశారు. అత్యధికంగా వలిగొండ మండలంలో 42,367 ఎకరాల్లో సాగు చేశారు. తర్వాతి స్థానాల్లో రామన్నపేట, భూదాన్ పోచంపల్లి ఉన్నాయి. వరి తర్వాత 1.02 లక్షల ఎకరాలతో పత్తి రెండో స్థానంలో ఉంది. సుమారు 3.50 లక్షల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. అక్టోబర్‌లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. జిల్లాలో 293 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఇందులో 75 కేంద్రాలు బంద్ అయ్యాయి. 80 ఐకేపీ కేంద్రాలను ప్రారంభించగా 20 కేంద్రాలు మూసేశారు. 207 పీఏసీఎస్ సెంటర్లు ఓపెన్ చేయగా 55 కేంద్రాలు క్లోజ్ చేశారు. 12 రైతు సేవా కేంద్రాలు కొనసాగుతున్నాయి. రామన్నపేట, వలిగొండ, తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాల్లో ఇంకా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు 2,28,063 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో 2,24,603 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలింది. ఇంకా 3,459 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు పంపించాల్సి ఉంది.

## రైతు ఖాతాల్లో రూ.358.23 కోట్లు జమ

జిల్లాలోని రైతులకు రూ.501.66 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటికే 358.23 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇంకా 143.30 కోట్లు అన్నదాత అకౌంట్లలో డిపాజిట్ చేయాల్సి ఉంది. మిగతావి ప్రాసెస్‌లో ఉన్నాయని, త్వరలోనే జమవుతాయని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ధాన్యం సేకరించినా కూడా డబ్బులు సకాలంలో అందేవి కావు. నెలలపాటు పెండింగ్‌లో పెట్టేవారు. దీంతో రైతులు పండించిన పంటకు డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు పడేవారు. కానీ తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు లేకుండా ఠంఛనుగా డబ్బులు అందించింది. ధాన్యం కొన్న వెంటనే డబ్బులు అందేలా చర్యలు తీసుకుంది.

## ఎన్నికలున్నా ఇబ్బందుల్లేకుండా..

జిల్లా అధికారులు పకడ్బందీ వ్యూహం, పక్కా కార్యాచరణతో పనిచేయడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా ధాన్యం సేకరణ ముగిసింది. అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)భాస్కర్ ఎన్నికలు ఉన్నా.. ప్రత్యేక చొరవ తీసుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. సివిల్ సప్లయ్, గ్రామీణాభివృద్ధి, సహకార, వ్యవసాయ శాఖలతోపాటు మరో పది శాఖలు సమన్వయం చేసుకోవడంతో కొనుగోళ్లు వేగంగా, సులభంగా జరిగాయి. పారదర్శకంగా కొనుగోళ్లు జరిగాయి. కొనుగోలు కేంద్రాల్లో అన్ని ముందస్తు ఏర్పాట్లు చేశారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చర్యలు చేపట్టారు. ఇంకా 57 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. ఇక రైతులు పండించిన ధాన్యానికి తెలంగాణ సర్కారు ఏటా మద్దతు ధర పెంచి కొనుగోలు చేస్తున్నది.

## యాసంగి సాగుకు సన్నాహాలు

వానకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు రావడం, యాసంగి సీజన్ నేపథ్యంలో వ్యవసాయ అధికారులు యాసంగి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. ఎన్నికలు ముగియడంతో ప్రణాళిక రూపొందిస్తున్నారు. 3.50 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఈసారి కూడా రైతులు వరి వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తున్నది. ఆ తర్వాత పత్తి, ఇతర పంటలు వేయనున్నారు. అదేవిధంగా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు నకిలీ విత్తనాలు అమ్మకుండా పటిష్ట నిఘా పెట్టేందుకు ప్లాన్ చేస్తున్నారు.



### ధాన్యం కొనుగోళ్ల వివరాలు ఇలా..

| | |
|---|---|
| మొత్తం కేంద్రాలు | 293 |
| మొత్తం రైతులు | 24,686 |
| సేకరించిన ధాన్యం | 2.28 లక్షల మెట్రిక్ టన్నులు |
| జమ చేసి డబ్బులు | రూ.358 కోట్లు |

# యాసంగి బాటలో...


పొలం దారి పట్టిన రైతన్నలు

ఎన్నికల కోలాహలం ముగియడంతో సాగు పనుల్లోకి..

యాసంగి దుక్కులు సిద్ధం

జనవరి 15 నాటికి పూర్తి కానున్న వరి నాట్లు

సూర్యాపేట జిల్లాలో 4లక్షల ఎకరాల్లో వరి సాగుకు అంచనా



నూతనకల్ మండలం యడవల్లిలో పొలం దున్నుతున్న రైతు

**గత కొద్ది రోజులుగా అన్నివర్గాల ప్రజలు ఎన్నికల కోలాహలంలో ఉండగా, ఇప్పుడు ఎన్నికలు పూర్తవడంతో ఆయా వర్గాలు తమ వృత్తులపై దృష్టి సారించాయి. ప్రధానంగా రైతన్నలు సాగు పనుల్లో బిజీ అవుతున్నారు. సూర్యాపేట జిల్లాకు కాళేశ్వరం జలాలతోపాటు మూసీ ఆయకట్టు ఉండగా మరోపక్క నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో 6,30,468 ఎకరాల సాగు భూమి ఉంది. అయితే నాగార్జునసాగర్‌లో నీళ్లు లేకపోవడంతో ఆయకట్టులో సాగు కొంత ఆశాజనకంగా ఉండని పరిస్థితి. ఈ సారి నాలుగు లక్షల ఎకరాల వరకు వరి సాగులోకి వస్తుందనే అంచనాలు ఉన్నాయి.**

*– సూర్యాపేట, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ)*

యాసంగి సాగు కోసం సూర్యాపేట జిల్లా రైతాంగం సిద్ధమవుతుంది. జిల్లాకు ఓ పక్కన ఉన్న నాగార్జునసాగర్‌లో నీళ్లు అడుగంటడంతో సాగర్ ఆయకట్టు పరిధిలోని హుజూర్‌నగర్, కోదాడతోపాటు సూర్యాపేట నియోజకవర్గంలోని కొంత ఏరియా రైతాంగం నిరాశతో ఉంది. మరో పక్క కాళేశ్వరం జలాలు, మూసీ ఫుల్‌గా ఉండడంతో ఆయా ప్రాంతాల రైతులు సంతోషంగా ఉన్నారు. గతేడాది యాసంగిలో దాదాపు 5.45 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేయగా మరో 75 వేల ఎకరాల వరకు ఇతర పంటలు సాగు చేశారు. అయితే ఈ సారి మాత్రం సాగర్ ఆయకట్టులో పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో దాదాపు 4 లక్షల ఎకరాల్లో పంటలు పండించే అవకాశం ఉండగా ఇతరత్రా పంటలు దాదాపు 25 వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

## సాగు పనుల్లో బిజీ..

నవంబర్ మూడో వారం నుంచే జిల్లాలో రైతాంగం సాగుబాట పట్టగా, ఎన్నికల కారణంగా అన్ని వర్గాలతోపాటు రైతాంగం కూడా ఎన్నికల బిజీలో గడిపారు. అయితే ప్రస్తుతం ఎన్నికలు పూర్తయినందున రైతులు సాగుబాట పడుతున్నారు. ఇప్పటికే దుక్కులు ప్రారంభం కాగా కొన్ని ప్రాంతాల్లో వరి నార్లు పోయడం, తుంగతుర్తి నియోజకవర్గంతోపాటు సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో నాట్లు కూడా వేస్తున్నారు. ఈ మేరకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను అందుబాటులోకి తెచ్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. 55 వేల మెట్రిక్ టన్నుల యూరియా, 16,650 మెట్రిక్ టన్నుల డీఏపీతోపాటు ఇతరత్రా ఎరువులు కలిపి సుమారు 1.50 లక్షల మెట్రిక్ టన్నులు కావాల్సి ఉండగా ఎన్నికలు పూర్తయినందున ఇప్పటి వరకు జిల్లాలో ఉన్న స్టాక్ లెక్కించి ఎంత అవసరమో అనే దానిపై ఇండెంట్ పెట్టనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా తెలిసింది.



అర్వపల్లి మండలం బొల్లంపల్లిలో సిద్ధం చేసిన మడి

# బంతి సాగు.. ఆదాయం బాగు

బంతిపూల సాగుతో ఆశించిన స్థాయిలో దిగుబడి

అధిక ఆదాయం పొందుతున్న దామరచర్ల రైతు

నిత్యం సంప్రదాయ పంటలు కాకుండా స్వల్పకాలంలో అధిక ఆదాయం పొందేలా సీజనల్ పంటలు సాగుచేసి అధిక ఆదాయం పొందుతున్నాడు దామరచర్లకు చెందిన రైతు చల్లా వెంకటేశ్వర్లు. మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి–అద్దంకి ప్రధాన రహదారి వెంట ఎకరం భూమి కౌలుకు తీసుకొని కుటుంబ సభ్యులతో కలిసి బంతి పూల సాగు చేపట్టాడు. ఈ సాగులో మంచి అనుభవం ఉండటంతో ఆశించిన స్థాయిలో దిగుబడి సాధిస్తూ అధిక ఆదాయం పొందుతున్నాడు.

*–దామరచర్ల, డిసెంబర్ 4*



పూలు కోస్తున్న మహిళా రైతు

మండల కేంద్రంలో ఎకరం నల్లరేగడి భూమిని కారుకు రూ.20 వేల చొప్పున కౌలుకు తీసుకొని 12 వేల బంతి మొక్కలు(పసుపు, ఎరుపు రంగు) నాటాడు. ఆంధ్రాలోని మాచర్ల నర్సరీలో ఒక్కో మొక్కను 5 రూపాయల చొప్పున కొనుగోలు చేశాడు. మొక్కలకు 60వేలు కాగా, మొక్కలు నాటినందుకు కూలీలకు 6 వేలు ఖర్చు అయ్యింది. రెండుసార్లు ఎరువులు వేయడంతోపాటు మందులు పిచికారీ చేశాడు. ఇప్పటి వరకు మొత్తం రూ.90 వేలు పెట్టుబడి పెట్టాడు.

## నిత్యం క్వింటా దిగుబడి..

ఈ ఏడాది అక్టోబర్‌లో 30 రోజుల వయసు గల నారు తెచ్చి నాటగా 50 రోజుల తర్వాత దిగుబడి ప్రారంభమైంది. రోజుకు 50 నుంచి 100 కేజీల వరకు మార్కెట్‌లో అమ్ముతున్నారు. తోట హైవే పక్కనే ఉండడంతో ఎంతోమంది తోట వద్దకే వచ్చి పూలు కొనుగోలు చేస్తున్నారు. పరిసర ప్రాంతాల నుంచి పూలవ్యాపారులతోపాటు అయ్యప్ప భక్తులు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల ఎలక్షన్లు కూడా ఉండడంతో మంచి గిరాకీ వచ్చింది.

## లక్ష వరకు ఆదాయం..

90 వేలు పెట్టుబడి పెట్టి పూలసాగు చేపట్టగా ఇప్పటి వరకు అన్ని ఖర్చులు పోను లక్ష రూపాయలు మిగిలినట్లు రైతు తెలిపాడు. ఈ పంట 180 రోజులపాటు దిగుబడి వస్తుందని, సంక్రాతి వరకు కొనసాగుతుందని చెప్పాడు. అదనంగా మరో లక్ష రూపాయలు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. క్వింటా పూల ధర 5 వేల నుంచి 8 వేల వరకు ఉంది. మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి ధరను నిర్ణయిస్తున్నారు.

## నిత్య ఆదాయం వస్తున్నది



బంతిపూల సాగు ఆశాజనకంగా ఉంది. నలుగురు కుటుంబ సభ్యులం పని చేస్తున్నాం. బంతిపూలకు డిమాండ్ ఉండటంతో తోట వద్దనే పూలు అమ్ముతున్నాం. రోజూ పూలు అమ్ముతుండడంతో నిత్య ఆదాయం వస్తుంది. పూలసాగులో నష్టమే లేదు. ఇప్పటికే లక్ష ఆదాయం వచ్చింది. ఇంకా పూల దిగుబడి వస్తున్నందున మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. హైవే పక్కనే ఉండడంతో ఇతర జిల్లాలకు చెందినవారు కూడా పూలు కొనుగోలు చేస్తున్నారు.

*–వెంకటేశ్వర్లు, రైతు, దామరచర్ల*



# భూసారం.. పంటలకు మూలాధారం

అశాస్త్రీయ, అసహజ పద్ధతుల్లో భూమి నిస్సారం

ఆరోగ్యవంతమైన నేలలతోనే జీవ వైవిధ్యం సాధ్యం

నేలలను పరిరక్షిస్తేనే సుస్థిర ఉత్పత్తులకు అవకాశం

నేడు ప్రపంచ మృత్తికా దినోత్సవం

గరిడేపల్లి, డిసెంబర్ 4 : ఈ భూమి పరిమితం. కానీ, నానాటికీ పెరుగుతున్న జనాభా మాత్రం అపరిమితం. పరిమితమైన భూమిపై పెరుగుతున్న జనాభాకు అనువైన ఆహార ఉత్పత్తులను అందజేయడం కష్టతరం. ఇటీవలే ఐక్యరాజ్య సమితి వెలువరించిన అధ్యయన నివేదిక ప్రకారం 2050 నాటికి 900 కోట్లకు చేరునున్న ప్రపంచ జనాభాకు అనువుగా ఇప్పటి ఆహార ధాన్యాల ఉత్పత్తిని 60 శాతం పైగా పెంచాల్సి ఉంటుంది. అయితే 1960లో మొదలైన హరిత విప్లవంతో దిగుబడులు గణనీయంగా పెరిగినప్పటికీ దాని సుస్థిరతను అంతగా సాధించుకోలేకపోయాం. సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా రసాయన ఎరువులు వాడకం విచ్చలవిడిగా పెరిగిపోయింది. అటువంటి అశాస్త్రీయ, అసహజ పద్ధతులు సహజంగానే నేలల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. భూసారం తగ్గడంతో లక్షలాది హెక్టార్ల విస్తీర్ణంలో పంట భూములు బీడు బారుతున్నాయి. దీంతో రానురాను ఆహార ఉత్పత్తులు మరింత తగ్గిపోయి మనిషి మనుగడే కష్టతరమయ్యే అవకాశం ఉంది. అందుకే భూ ఆరోగ్యాన్ని మన కర్తవ్యంగా స్వీకరంచాలనేది నిపుణులు మాట. ఇందులో భాగంగానే నేలల పరిరక్షణ కోసం ఐక్యరాజ్య సమితి ప్రతి డిసెంబర్ 5ను ప్రపంచ మృత్తికా దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించింది. 2023వ సంవత్సరం మృత్తికా దినోత్సవానికిగాను 'నేల, నీరు జీవితానికి ఒక వనరు' అనే థీమ్‌ను ప్రకటించింది. నేడు ప్రపంచ మృత్తికా దినోత్సవం సందర్భంగా నేలల పరిరక్షణకు అనుసరించాల్సిన విధానాలపై ప్రత్యేక కథనం.

## భూమే మూలాధారం

అనంతమైన జీవ వైవిధ్యానికి ఆరోగ్యకరమైన నేలలే పట్టుగొమ్మలు. ఒక ప్రాంతంలో ఉండే జీవ సమూహంలోని వ్యత్యాసాలను జీవ వైవిధ్యంగా పరిగణిస్తారు. నేలలో కోట్ల సంఖ్యలో సూక్ష్మజీవులు ఉంటాయి. వానపాములు, కీటకాలు, ఎలికపాములు వంటి అనేక జీవరాశులతో ఇది నిర్ధారణ అవుతుంది. ఒక అంచనా ప్రకారం చదరపు మీటర్ వైశాల్యంలోని మంచి నేలలో వెయ్యి రకాల సూక్ష్మజీవుల జాతులు ఉండి జీవ వైవిధ్యానికి కారణమవుతున్నాయి. నేలకు చేరిన కర్బన సమ్మేళనాలను అందులోని సూక్ష్మజీవులు వినియోగించుకుని పర్యావరణాన్ని కాపాడుతున్నాయి. నేలలోని జీవవైవిధ్యం వలన అనేక ఉపయోగాలు కలుగుతున్నాయి. కొన్ని దశాబ్దాలుగా పచ్చికబయళ్లను, అడవులను పంట భూములుగా మార్చడంతో విపరీతమైన మార్పులు సంభవిస్తున్నాయి. పంటల ఉత్పాదకత తగ్గడం, ఆహార భద్రత దెబ్బతినడం, కాలుష్యం పెరుగడం, పర్యావరణంపై దుష్ప్రభావం వంటి సమస్యలు ఎక్కువవుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయంలోనూ మార్పులు రావాల్సిన ఆవశ్యకత ఉంది. సేంద్రియ సాగును ప్రోత్సహిస్తే కొంతవరకైనా మార్పు రానున్నది.



వర్మీ కంపోస్ట్‌ను సిద్ధం చేస్తున్న మహిళలు

## నేలల సంరక్షణకు మార్గాలెన్నో..

- నేలలో ఆరోగ్యాన్ని పెంపొందించి సంరక్షించేందుకు హితకరమైన సాగు పద్ధతులు ఉన్నాఇయి. అవి పర్యావరణానికి అనువైన వ్యవసాయం అంటే సాగు పద్ధతులను (దేశీయ, ప్రాంతీయ, ఆధునిక) సమగ్రపరిచి పర్యావరణ వ్యవస్థను కాపాడడం. అదేవిధంగా ఆహార ధాన్యాలను, పశుగ్రాసాన్ని, ఔషధ మొక్కలను ఉత్పత్తి చేయడం.
- సేంద్రియ వ్యవసాయం మరో పద్ధతి, ఇందులో సేంద్రియ ఎరువులు, జీవసంబధ పురుగు మందులు, పచ్చిరొట్ట, జీవన ఎరువులు వినియోగిస్తారు.
- సాగు ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ కొండ ప్రాంతాల్లోని పోడు వ్యవసాయ పద్ధతిని నియంత్రించాలి. సమగ్ర పద్ధతులను పాటించి నేలకోతను అరికట్టాలి. నీటి వినియోగాన్ని సమర్థవంతంగా చేపట్టాలి.
- భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించుకోవాలి. అదేరీతిలో సమగ్ర చీడ, పీడల యాజమాన్యం చేపట్టడం అవసరం.
- సురక్షిత వ్యవసాయ పద్ధతులు కొన్ని ఉన్నాయి. విత్తనానికి అవసరమైన చోట మాత్రమే దుక్కి చేయాలి. నేలను కప్పి ఉంచే పద్ధతిని అనుసరించాలి.
- పంట మార్పిడి, అంతర పంటలు, మిశ్రమ పంటలు, సాగు విధానాల కొనసాగింపుతో నేలకోతను అరికట్టవచ్చు. అలాగే తగినన్ని ఆహార ఉత్పత్తులు సాధించవచ్చు.
- సాగు నేలలు, సేంద్రియ పదార్థాలు, పంట మిగుళ్లతో కప్పి ఉంచడం మరో పద్ధతి. ఈ విధానంలో నేలలోని తేమను సంరక్షించవచ్చు. దాంతో చీడ, పీడల బెడద తగ్గి నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు సాధ్యమవుతున్నాయి. వర్షపు నీరు సంరక్షణకు వీలవుతుంది. వరద భయాలు తగ్గుతాయి.
- వ్యవసాయ, అటవీ సంయుక్త పద్ధతి కూడా ఉంది. వ్యవసాయ పంటలను, అటవీ మొక్కలను సంయుక్తంగా అనువైన రీతిలో ఒకే పొలంలో సాగు చేయడం ఇందులో ఉంటుంది. దీని వలన కొన్ని రకాల అటవీ ఉత్పత్తులు నివాసాలకు అవసరమైన కలప, పశగ్రాసం వంటి ఉత్పత్తులు సుస్థిరమైన రీతిలో ఒనగూరుతాయి. సమతుల ఆహార వ్యవస్థ నెలకొంటుంది. నేలల సారాన్ని పునరుద్ధరించడం సులభతరమవుతుంది.

## భూసార పరిరక్షణకు చేపడుతున్న చర్యలు..

- రైతులకు సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమాలు, ప్రదర్శనా క్షేత్రాలు ఏర్పాటు చేయడం.
- కేంద్ర ప్రభుత్వం 2022 సంవత్సరం నుంచి 'అవుట్ స్కేలింగ్ ఆఫ్ నేచురల్ ఫార్మింగ్' ప్రాజెక్ట్ ద్వారా రైతులకు శిక్షణ, అవగాహన, ప్రకృతి వ్యవసాయంపై కిసాన్ మేళా, ప్రదర్శనా క్షేత్రాలు ఏర్పాటు చేసి శాస్త్రవేత్తలు, అధికారుల ద్వారా పూర్తి విషయం గురించి వివరించడం.
- సాయిల్ హెల్త్ కార్డు ద్వారా రైతులకు భూసార పరిరక్షణపై అవగాహన కల్పించి భూసార పరీక్షా పత్రాలు అందజేయడం.
- ప్రభుత్వ సహకారంతో జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను సబ్సిడీపై అందిచడంతో రైతులు వాటిని సాగు చేసి తర్వాత భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం పెంచుకునేలా చేయడం.
- జీవన ఎరువులపై అవగాహన కల్పించడం. వీటిని తక్కువ ధరలకు రైతులకు అందజేయడం వంటి చర్యలు చేపట్టడం.
- సమస్యాత్మక(చౌడు)భూములైతే వాటిలో నీరు ఇంకే స్వభావం తక్కువ కాబట్టి పొలం చుట్టూ మురుగు కాల్వలను ఏర్పాటు చేసుకునేలా చేసి అవసరమైన మేరకు జిప్సం వేసేలా చూడడం. సున్నం పాలు ఎక్కువగా ఉంటే గంధకం వేయడం వంటి సలహాలు ఇస్తున్నారు.

## నేల పరిరక్షణ మన బాధ్యత



అధిక దిగుబడులు సాధించాలనే ఏకైక లక్ష్యంతో కొందరు రైతులు మోతాదుకు మించి రసాయన మందులు పిచికారీ చేస్తున్నారు. అలాగే పోటీపడుతూ ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల నుంచి వెలువుడుతున్న కొన్ని రకాల రసాయనాలను సైతం బయటకు విడుదల చేయడంతో నేల సారం తగ్గి దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయి. చీడపీడల ఉధృతి సైతం రాను రాను పెరుగుతుంది. ఫలితంగా రైతులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఏ పంట పండాలన్నా నేల ముఖ్యమైనది. కావునా ప్రతి ఒక్కరూ నేల పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలి. ఇందులో భాగంగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలి. పచ్చిరొట్ట, జీవన ఎరువులు, వర్మీకంపోస్ట్, జీవ శిలీంద్రనాశనులను వాడితే పర్యావరణం కాలుష్యం కాకుండా ఉండడమే కాకుండా భూసారం సైతం పెరుగుతుంది.

*– అరిగెల కిరణ్, కేవీకే మృత్తికా శాస్త్రవేత్త, గడ్డిపల్లి*